క్లుప్తంగా

విశాఖ వెటరన్ అథ్లెట్ మీట్ రేపు

మురళీనగర్: విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఆదివారం వెటరన్ అథ్లెటిక్స్ మీట్ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.బాబూరావు, మంగా వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రన్నింగ్ 100 మీ., 200 మీ., 400 మీ., 800 మీ., 1500 మీ., 5000 మీ., వాకింగ్ 5 కి.మీ., లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, జావిలిన్ త్రో, డిస్కుత్రో, హేమర్ త్రో వంటి క్రీడల్లో పోటీలు జరుగుతాయన్నారు. 30 ఏళ్లు దాటిన వారందరూ పాల్గొనవచ్చని, వయసుల వారీగా విభజించి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

క్రీడాకారులు వారి పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో రావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన వారిని నవంబర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. పాల్గొన్న వారికి స్నాక్స్, మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. వివరాలకు 97013 47311, 98666 68966, 83091 57522, 92474 24395 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'


వినతులు స్వీకరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు స్వీకరించి వెంటనే కొన్నింటిని పరిష్కరించారు. మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యామకుమార్‌రెడ్డి, సుశీల, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో భజన సత్సంగం


భజన సత్సంగం నిర్వహిస్తున్న శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ అర్చకుడు శేషాచార్యుడు ఆధ్వర్యంలో వైభవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ బృందం నిర్వహించిన భజన సత్సంగం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా రాగమాలిక సంస్థ వార్షికోత్సవం

సీతంపేట: రాగమాలిక సాంస్కృతిక సంస్థ 15వ వార్షికోత్సవం శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. రాగమాలిక సభ్యులు మహమ్మద్ ఖాన్, మీనా కుమారి, ఆదిలక్ష్మి, ఇందిర, శైలజ, శ్వేత, సుబ్బారావు, పార్థసారధి, భరద్వాజ్ అలనాటి మేటి చిత్ర గీతాలను ఆలపించి అలరించారు. కార్యక్రమంలో భయ్యా శ్రీనివాస్, విజయరమణి, వెంకటేష్, సత్యనారాయణ, సన్‌మూర్తి పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు తరలివస్తున్న జనం


దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలోని వైద్య శిబిరంలో బీపీ టెస్ట్ చేయించుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా లక్షలాది మందికి ఉచితంగా వైద్య సేవలందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 24వ వార్డు రేసపువానిపాలెం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 24వ వార్డు 138 సచివాలయం పరిధికి సంబంధించి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో, 22వ వార్డు 148 సచివాలయం పరిధికి సంబంధించి పార్టీ వార్డు అధ్యక్షుడు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ఆధ్వర్యంలో ఈ శిబిరాలు జరిగాయి. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేయించుకున్న వారిని కె.కె.రాజు పలకరించారు. వారి మెడికల్ పత్రాలను, ఉచితంగా పంపిణీ చేసిన మందులను పరిశీలించారు. ముందుగా అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్తలు ప్రదర్శించిన పౌష్టికాహార పదార్థాలను పరిశీలించి రుచి చూశారు. అనంతరం కె.కె.రాజు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యుడు మన్మోహన్, మండల కన్వీనర్లు జి.వి.రమణి, మురళీకృష్ణారెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, బొచ్చు కృష్ణారెడ్డి, రేసపు కృష్ణారెడ్డి, గుడ్ల అశోక్‌రెడ్డి, కామేశ్వరరెడ్డి, శివరంజని, కుసుమ, రమ, గోపి, రామకృష్ణ, సచివాలయ అడ్మిన్, అంగన్‌వాడీ టీచర్లు గౌరి, రాజ్యలక్ష్మి, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, బోర కుమార్‌రెడ్డి, 22వ వార్డు నాయకులు, పార్లమెంట్ జనరల్ సెక్రటరీ మహేష్, మహిళా అధ్యక్షురాలు వంకర శశికళ, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మరింత చేరువగా వైద్య సేవలు

సీతంపేట: పేదలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 43వ వార్డు దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో 242 సచివాలయానికి సంబంధించి కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది.

రోగులకు నిర్వహించిన వైద్య పరీక్షలను ఆయన పరిశీలించారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ పేదలపై వైద్య ఖర్చుల భారం పడకుండా సుమారు 3500లకు పైగా వ్యాధులను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి ఉచితంగా వైద్య సేవలు అందేలా సీఎం వైఎస్ జగన్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, మండల కన్వీనర్లు జి.వి.రమణి, మురళీకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు మహదాస్య గోపి, బైర వెంకట్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరం సందర్శన

మద్రిపాలెం: ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో పాటుపడుతున్నారని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ అన్నారు. 294 సచివాలయం పరిధి మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మావతి, మండల ఇన్‌చార్జి పైడి కృష్ణారావు మాస్టర్, సబ్బవరపు శ్రీను, టీఎస్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్, వైద్య సిబ్బంది, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


రేసపువానిపాలెంలో అంగన్‌వాడీ పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తున్న కె.కె.రాజు


24వ వార్డు వైద్య శిబిరంలో ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న మహిళలు


50వ వార్డులో వైద్య పరీక్షల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే విజయం తథ్యం

ఉద్యోగార్థులతో కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

సీతంపేట: జీవితంలో రాణించాలంటే బహుముఖ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. లైబ్రరీలోని వివిధ విభాగాలను పరిశీలించి చక్కగా నిర్వహిస్తున్నారని గ్రంథాలయ కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సూచనలిచ్చారు. ప్రణాళిక బద్ధంగా పోటీ పరీక్షలకు సిద్ధమైతే విజయం సాధించగలరన్నారు. ప్రారంభంలో అపజయం ఎదురైనా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా మరింత ఉత్సాహంతో ప్రయత్నం కొనసాగించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలు, పుస్తకాలతో తనకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. మానసిక ఒత్తిడిని ఎదుర్కొని పనిచేయగలిగితే సంతోషం మన దగ్గరే ఉంటుందన్నారు. తన విద్యాభ్యాసం అనంతరం వైద్య వృత్తిని సాగించడం, ఆ తర్వాత సాగిన సివిల్స్ ప్రిపరేషన్, ఐఏఎస్ ఎంపిక మొదలైన విషయాలను తెలియజేశారు. పౌర గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ, ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షులు టి.ఆర్.ఎస్.ప్రసాద్, సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు, లైబ్రేరియన్ దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకూ మేలు


లబ్ధిదారులకు కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు, పీలా వెంకటలక్ష్మి

సీతంపేట: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 26వ వార్డు శాంతిపురం సచివాలయం(127) పరిధిలోని శంకువానిపాలెంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని, అభివృద్ధి పనులను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన విద్యుత్ సరఫరా, బల్క్ వాటర్ కనెక్షన్ల సమస్యలను సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ ఫలాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, 26వ వార్డు నాయకులు నవాబ్, శేషు, అమ్మాజీ, ఎం.సునీల్, శ్యామల, హరికృష్ణ, విజయ్‌పాల్, ఫరూఖ్, బాబ్‌జాన్, సుశీల, రమాదేవి, గౌస్య, లక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు గణేష్‌కు ముస్లింల సత్కారం


గణేష్‌ను సత్కరిస్తున్న ముస్లింలు

మద్రిపాలెం: ఇటీవల నేపాల్‌లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన 53వ వార్డుకు చెందిన రాయి గణేష్‌ను జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్-ఈ-అల్ ఖదీర్ కమిటీ సభ్యులతోపాటు స్థానికులు శుక్రవారం మసీద్ ప్రాంగణంలో శాలువతో ఆత్మీయ సత్కారం చేశారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా కేవలం పదో తరగతి వరకు చదువుకున్న గణేష్ వెయిట్‌లిఫ్టింగ్, వ్యాయామంపై మొదటి నుంచి ఆసక్తి ప్రదర్శించేవాడని, అలాంటి క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని కాలనీవాసులు కోరారు. క్రీడాకారుడు గణేష్ మాట్లాడుతూ ఏషియన్ చాంపియన్‌షిప్, కామన్‌వెల్త్ పోటీల్లో బంగారు పతకాలు సాధించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మున్నా, కార్యదర్శి వలీ, నూరి, బాషా, మదార్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 76 మందికి ఉద్యోగాలు


అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. ఎంఎఎస్ మెరైన్ సర్వీస్, ఫ్లిప్‌కార్ట్, వరుణ్ మోటార్స్, ఎల్.వి.ప్రసాద్ ఐ ఆస్పత్రి, ముత్తూట్ ఫైనాన్స్, దక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 295 ఉద్యోగాల ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 185 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 76 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తోందని ఆయన అన్నారు. నిరుద్యోగులు ఉపాధి అవకాశాల కోసం జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులచే దీపావళి ప్రమిదల తయారీ


ప్రమిదల తయారీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: దీపావళిని పురస్కరించుకుని అక్కయ్యపాలెంలోని ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలతో కుషి దీప్ ప్రాజెక్టులో భాగంగా మట్టితో ప్రమిదలు చేసే కార్యక్రమాన్ని శుక్రవారం 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు తయారు చేస్తున్న మట్టి ప్రమిదలను కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలన్నారు. సొసైటీ అధ్యక్షురాలు జై.వి.ఎల్.సుచిత్రా మాట్లాడుతూ దివ్యాంగులు తయారు చేసిన ప్రమిదలను నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఎగ్జిబిషన్లు పెట్టి విక్రయిస్తామన్నారు. షాపింగ్ మాల్స్, కార్యాలయాల్లో స్టాల్స్ పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దివ్యాంగ పిల్లలు తయారు చేసిన ప్రమిదలు కావాల్సిన వారు 93479 73327 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

'సామాజిక సాధికార బస్సుయాత్ర' సభ నేడు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శనివారం మధ్యాహ్నం చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ జరగనుంది. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు మీడియా సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం యాత్రలో పాల్గొన్న మంత్రుల బృందం చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బోయిపాలెం కూడలి నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీ ప్రారంభమై తగరపువలస వరకు సాగుతుంది. చివరిగా చిట్టివలస బంతాట మైదానంలో మధ్యాహం 3 గంటలకు జరిగే బహిరంగ సభకు జీవీఎంసీ, భీమిలి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 30 వేల మంది వరకు హాజరుకానున్నట్టు అంచనా వేశారు. ప్రజల సౌకర్యార్థం 16 వేల కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.

బస్సు యాత్ర విజయవంతానికి కృషి

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డితో గురు, శుక్రవారాల్లో బహిరంగ సభ ప్రదేశాన్ని పరిశీలించారు. మరోవైపు శుక్రవారం మధురవాడ జోన్ ఏసీపీ ఎం.శివరామిరెడ్డి, భీమిలి సీఐ డి.రమేష్ చిట్టివలస బంతాట మైదానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

అంగన్‌వాడీ భవన పునర్నిర్మాణానికి శంకుస్థాపన


సూరిబాబునగర్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు సూరిబాబునగర్‌లో అంగన్‌వాడీ కేంద్ర భవన పునర్నిర్మాణానికి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. అనంతరం అభివృద్ధి పనుల శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పనులు జరుగుతున్న సమయాల్లో పర్యవేక్షించాలన్నారు. సుమారు రూ.19.80 లక్షల నిధులతో అంగన్‌వాడీ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు డిప్యూటీ మేయర్ సతీష్ తెలిపారు. కార్యక్రమంలో డీఈ భరణి, ఏఈ ఉమామహేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జాగారావు నరేష్, వార్డు నాయకుడు పలివేల ఈశ్వరి, వి.అప్పారావు, అప్పలరెడ్డి, గోవింద్, కె.చిన్నా, రామారావు, కృష్ణ, నర్సింగరావు, లావణ్య, కృపా, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ సీపీకి వినతులు


సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

దొండపర్తి : పోలీస్ సిబ్బంది సమస్యలు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీసుల సమస్యల పరిష్కారానికి సీపీ శుక్రవారం తన ఛాంబర్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 13 మంది సిబ్బంది తమ సమస్యలను వినతుల రూపంలో సీపీకి తెలిపారు. ఇందులో ప్రమోషన్లు, క్వార్టర్లు, విభజన సమయంలో అనకాపల్లికి వెళ్లిన ఆరుగురు సిబ్బందిని తిరిగి నగర పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ సీపీకి వినతులు అందజేశారు.

మహా అన్నసమారాధనలు


తాటిచెట్లపాలెంలో అన్నదానం చేస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు


సంజీవయ్య కాలనీ-2లో అన్నదానం చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ దంపతులు


మురళీనగర్ రామాలయంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం బజార్ లైన్‌లో కనకదుర్గాదేవి ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, భారీ అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు అన్నదానం ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి వారు పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు, ఉత్సవ నిర్వాహకులు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

46వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు సంజీవయ్య కాలనీ-2లో దుర్గాదేవి మహోత్సవాల్లో భాగంగా దుర్గమ్మ మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. ముందుగా దుర్గాదేవికి సతీష్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పుష్పలత, సరోజిని, కనక, హైమా, అన్నపూర్ణ, ఈశ్వరి, లావణ్య, వేణు, కొండమ్మ, కృప, లక్ష్మి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్ రామాలయంలో..

మురళీనగర్: మురళీనగర్‌లోని రామాలయంలో నిర్వహించిన దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సందర్భంగా శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయం నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కార్తీక్ కుట్ట, సంగు వాసు, ఉప్పాడ శేఖర్, ఆనంద్, రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన


నృత్యంతో అలరిస్తున్న విద్యార్థులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. శ్రీనృత్య కళాంజలి క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆనంద నారాయణ గణపతిం, శ్రీవిఘ్న రాజం భజే, అష్టలక్ష్మీ స్తోత్రం, శ్యామలే మీనాక్షి, వినాయక స్తోత్రం, సంధ్యా సమయం, శ్రీ లలితా హారతి పాటలకు నృత్య అభినయం చేసి అలరించారు. అనంతరం అకాడమీ గురువు పి.రమ్య, విద్యార్థులను పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ అభినందించారు.

వానప్రస్థ వృద్ధాశ్రమంలో కంటి వైద్య శిబిరం


వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మురళీనగర్: పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రమ వృద్ధులతోపాటు పరిసరాల్లోని వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ అవసరమైన ఏర్పాట్లు చేశారు.

అఖిల్‌కు రూ.లక్ష ప్రోత్సాహం


అఖిల్‌కు రూ.లక్ష చెక్ అందజేస్తున్న కె.కె.రాజు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ అండర్-11 చదరంగం చాంపియన్‌షిప్‌లో 11వ స్థానంలో నిలిచిన విశాఖకు చెందిన అఖిల్ శ్రీప్రసాద్ రూ.లక్ష ప్రోత్సాహకాన్ని అందుకున్నాడు. పోర్ట్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొన్న చిన్నారుల్లో అఖిల్ తొలిస్థానంలో నిలిచాడు. ఓపెన్, బాలికల విభాగాల్లో ఏపీ తరఫున పాల్గొని ఆధిక్యాన్ని ప్రదర్శించిన ఇద్దరు చిన్నారులకు చెరో రూ.లక్ష ప్రభుత్వం తరఫున ఇవ్వనున్నట్లు ఇటీవల జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. దీనిలో అఖిల్‌కు శుక్రవారం పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చెక్ అందజేశారు.

ఉదయం 10 గంటల వరకే వైభవుడి దర్శనం

మురళీనగర్: ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామికి పౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం నిర్వహిస్తామని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. చంద్ర గ్రహణం కారణంగా ఆలయాన్ని ఉదయం 10 గంటలకు మూసివేసి, స్వామి దర్శనాలు నిలిపివేస్తామన్నారు.